తూర్పువాన్నా తెల్లవారకముందే రేవుకొచ్చి 'దబ్ దబ్' మని బాదేస్తూ బట్ట లుతుకుతోంది మంగమ్మ.

చంటి పిల్లాడికి జ్వరంగా వుండడంతో వారం రోజులనుంచి రేవుకు రావడానికి కుదర్లేదు మంగమ్మకు. బట్టలు మురిగిపోవడంతో ఆ రోజు తెల్లారకముందే లేచొచ్చి గబగబా వుతికి పారేస్తూంది.



# పాపం మంగమ్మ

కె. శైలజ

నీటిలో బట్టలు ముంచి సబ్బు వడు తున్న మంగమ్మకు "మంగమ్మా, నువు వుతుకుతుంటే .... అబ్బ మంగమ్మా" ఎవరో కొద్దిదూరంలో పాడుతున్న పాట చల్లగాలి తనతోపాటు మోసుకొచ్చి చెవిన పడేసింది.

ఆ పాట తన గురించే. ఆ గొంతు రాజుగాడిది - గుర్తు పట్టింది మంగమ్మ.

"సచ్చినోడు రేవులో ఎవరూ లేరని నన్ను జూసి పాటలు మొదలెడతాడా వీడి శిగదరగ" అని తిట్టుకుంటూ "ఒరేయ్ రాజుగా! పొగరు వెధవా!" అంటూ రాజు బట్టలుతుకుతున్న దిశకేసి వడివడిగా నడిచింది మంగమ్మ.

అపర కాళిలా వచ్చిన మంగమ్మను ఆ మసక వెలుగులో జూసి అవాక్కయి నిలుచుండిపోయాడు రాజు.

"ఏరా! ఎలాగుందిరా ఒళ్ళు? రేవెట్టేయగలను. జాగర్త! ఒంటిగున్నానని అల్లరెడ్డామనుకుంటున్నావా? ఎంత ఇరోధముంటే మాత్రం ఒదిన వరసనైనా చూడకుండా పాటలు పాడ్తావురా - పాటలు. వెధవా, పనికిమాలిన వెధవా!" తిట్లు మొదలుపెట్టింది మంగమ్మ.

"ఏటమ్మోయ్? ఎటీ? నిన్నేమన్నానూ" ఆశ్చర్యంగా చూశాడు రాజు.


"ఏటా! 'మంగమ్మా' అంటూ ఆ పాటేందిరా? ఏందిరా! ఎట్టాగుందిరా నన్ను సూత్తుంటే?" మీది మీదికొస్తున్న మంగమ్మనుచూసి జడిసిపోయి ఓ అడుగు వెనక్కు వేశాడు రాజు.

"అది సినమ్మపాటమ్మోయ్! నిన్ను జూసి పాడింది కాదు. అసలు నువ్వు రేవులో వున్నావనే తెల్దు నాకు. రాత్రి పక్కూరి టూరింగ్ టాకీసులో కొత్త సినమ్మవస్తే పోయుంటి. అందులో పాటది. కావలిస్తే ఎవురినన్నా అడుగు" తన తప్పేమీ లేదన్నట్లుగా చెప్పాడు రాజు.

"ఓరోరి! సినమ్మపాటా! ఏరా! నన్నే బోల్తా కొట్టించా లనుకుంటున్నావా! నేను నమ్ముతాననే! రెండు కుటుంబాలకి పడదని తెల్సి ఒంటిగొచ్చానని యాగీ సెయ్యాలని సూత్తన్నావా? పైగా సినమ్మ పాటని తప్పించుకోవాలని సూత్తన్నావా? మావతోసెప్పి నీ కాళ్ళిరగ్గొటించకపోతే సూడు" విస విసా నడుస్తూ, అరుచుకుంటూ రేవొదిలేసి యింటికేసి పరుగుతీసింది మంగమ్మ.

దిమ్మెరపోయి చూస్తూ నిలుచుండిపోయాడు రాజు.

రాజు కుటుంబానికి, మంగమ్మ కుటుంబానికి పడదు. బద్ధ విరోధులు. మంగమ్మ రాజుకు వదిన వరుస అవుతుంది. రాజుకు సినిమా పిచ్చి ఎక్కువ. వీళ్ళున్నపల్లెలో



ఏ సినిమాహాలూ లేదుగాని. పక్క పల్లెలో ఓ చిన్న టూరింగ్ టాకీస్ వుంది. అక్కడికి చాలా పాత సినిమాలు చాలా కాలానికి వస్తూ వుంటాయి. అదే గొప్ప అక్కడి ప్రజలకు. వచ్చిన ప్రతి సినిమా అందరి కన్నా ముందువెళ్ళి చూస్తాడు రాజు. అలాగే రాత్రి వెళ్ళి చూశాడు. అసలే పాటల పిచ్చి ఎక్కువ. ఆ పాట కాస్తా నోటి కొచ్చేసింది. ఉషారుగా రేవుకొచ్చి పాట పాడుకుంటూ బట్టలు వుతికేస్తున్నాడు. మంగమ్మ రేవులో వున్న సంగతి రాజుకి తెలీదు.

"సచ్చానురా భగవంతుడా! అసలే నోరు జాస్తి! రానీ! ఏం సేత్తదో సూత్తాను! అయినా అది సిన్మా పాట. సిన్మాపాట పాడుకున్నా తప్పేనా! ఏటీ! ఈ రేవులో గొడవ పడేకన్నా యింటికాడ కెత్తే మంచిదేమో! అమ్మో! ఈ మంగమ్మ మహాతల్లి రేవులో బట్టలన్నీ ఒగ్గేసి పోయిందే! అవి కాస్తా యెవడన్నా ఎత్తుకెత్తే ఆ దొంగతనంకాస్తా నా నెత్తినే రుద్దుతుంది!" అనుకుంటూ మంగమ్మ బట్టలకికూడా తనే కాపలా కాస్తూ కూర్చున్నాడు రాజు. మొగుడు రాముల్ని, మరో ముగ్గురు మగవాళ్ళని వెంటేసుకుని హుటాహుటీన రేవు కొచ్చింది మంగమ్మ.

"ఏరా! ఎలాగుందిరా నీకు! అది పుటుకుతుంటే యేమైందిరా! తిపర మెక్కిందా! వదినైనదాన్నట్టుకుని పాటలు పాడ్తావురా! యిప్పుడు పాడరా! సూత్తాను! పాడూ" అంటూ రాజు షర్టు కాలరందుకున్నాడు రాముడు.

"ఓరన్నోయ్! ఆగాగు. అనవసరంగా తగువెట్టుకోకు. నిజం తెలీకుండా మాట లిసిరేయకు. వదినమ్మ రేవులోవున్న సంగతే నాకు తెలీదు. అది సిన్మాపాట. కావాలంటే పక్కూరి టూరింగ్ టాకీసు కెళ్ళి సినిమా సూడు. నిజం తెలుసుకో! నామాట అబద్ధమైతేఅప్పుడు తన్ను, తిట్టు.




రీటా

జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా. చక్కగా పెరగడానికీ, చల్లదనానికీ, దానికదే సాటి.

రీటా వాడి. మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి

రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును




స్త్రీలూ పురుషులూ

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.

అంతేగాని వట్టినే నా జోలికి రామాకు." అంటూ రాముడిని ఓ తోపు తోశాడు రాజు.

గొడవకి అప్పుడే రేవుకు చేరుకుంటున్న వాళ్ళందరూ వీరి చుట్టూ చేరి పోయారు. రాజు తప్పు యింక ఎవరూ ఆ సినిమా చూడకపోవడంతో ఎటువైపూ సాక్ష్యం చెప్పడానికి వీల్లేని పరిస్థితి అయి పోయింది. కిందామీదావడి కొట్టుకోవడానికి సిద్ధపడుతున్న యిద్దరినీ కష్టపడి శాంతింప జేశారు.

"ఒరే రాముడూ! ఎందుకొచ్చిన గొడవ! సినిమా పాటని సెప్తన్నాడుగా! పోయి సిన్మా జూడు! అందులో పాట లేసంటే ఈడి పని పట్టు. ఊరిడిచి ఎక్క డికి పోతాడు" అంటూ సర్దిచెప్పారు.

"తప్పకుండా సిన్మా సూత్తాను. అటో, యిటో తేల్చుకోనిగాని నిద్దరోను. దొంగ వెధవ! సిన్మాపాటంట సిన్మాపాట! ఒరేయ్ రాజుగా! తప్పించుకొన్నా నను కుంటున్నావు గాబోలు! రేపు నీపని అయి పోద్ది జాగర్త!" అంటూ శపథం చేసింది మంగమ్మ.

"పోవమ్మా! సిన్మాజూసొచ్చి మాట్లాడు" విసుగ్గా అంటూ పోయాడు రాజు.

"ఛా" అంటూ ఉమ్మేసి విస విసా నడుచుకుంటూ తన బట్టలకేసి నడిచింది మంగమ్మ. మంగమ్మకు మహా కోపంగా వుంది. ఘోరమైన అవమానం జరిగి నట్టుగా బాధపడిపోతోంది.

* * *

రాత్రికి గబగబా పనంతా ముగించు కుని, పిల్లల్ని అత్తకు అప్పగించి మొగు డిని పూదరగొట్టి, మొగుడివెనక సైకి లెక్కి పక్కూరి టూరింగ్ టాకీసుకు బయలుదేరింది మంగమ్మ. రేవులో గొడవ విన్న చాలామంది వచ్చారు సినిమాకి.

సినిమా మొదలయింది. తొత్కా లి కంగా పాటగొడవ మర్చిపోయి అందరూ ఆతృతగా సినిమా చూస్తున్నా. ఒక్క మంగమ్మ మాత్రం నిప్పుల మీద కూర్చున్నట్టు కూర్చుని పాటకోసం యెదురు చూస్తోంది. ఎదురు చూసిన క్షణం వచ్చేసింది. పాట మొదలైంది. మంగమ్మ అవాక్కై యి పోయింది. నోట మాట రావడంలేదు. గుడ్లప్పగించి తెరకేసి చూస్తోంది.

రాముడు ఉగయం గొడవ మర్చేపోయాడు సినిమాలోపడి. చాలా ఆనందంగా పాట వింటున్నాడు. మంగమ్మకు మండి పోయింది మొగుడిని చూస్తుంటే. చాల మంది మగవాళ్ళకి పాట బాగుంది. ఈలలు వేస్తున్నారు. చప్పట్లు చరుస్తున్నారు. మంగమ్మ తల భూమిలోకి దిగిపోయింది. రాజు తన కళ్ళముందు పగలబడి నవ్వు తున్నట్లుగా అనిపించింది. తన వాళ్ళందరూ రేవులో తన చుట్టూ చేరి "మంగమ్మా!" అంటూ పాట పాడు తున్నట్లు ఊహించుకుని "అమ్మో! రేపు రేవులో మొగమెట్లా ఎత్తుకుని తిరగాల? అనవసరంగా గొడవెట్టుకున్నానే! ఖర్మ!" అనుకుంటూ "పదరామావా! పోదాం" అంది రాముడితో.

"ఉండహె! పాట బాగుంది. ఇంకా సిన్మా వుంది. అప్పుడే యేడకి బోతావు" అంటూ మంగమ్మను విదిలించి పారేసి సినిమాలో లీనం అయిపోయాడు రాముడు.

సినిమాని, సినిమాలో పాటని, అంద రినీ తిట్టేసుకుంటూ నిస్సహాయంగా సినిమా అయ్యేవరకూ కూర్చుండి పోయింది మంగమ్మ.

మంగమ్మను వెనక కూర్చోపెట్టుకుని తమ పల్లెవైపు ఉషారుగా సైకిలు తొక్కుతూ 'నోర్మూసుకో'మని మంగమ్మ అంటున్నా వినిపించుకోకుండా "మంగమ్మో నువ్వు ఉతుకుతుంటే...." అని పాడేస్తున్న మొగుడ్ని ఏమీ చెయ్య లేక 'చెవుడొచ్చినా బాగుండిపోనురా దేవుడా!' అనుకుంది మంగమ్మ- పాపం మంగమ్మ!


(జరిగిన సంఘటన ఆధారంగా చేసు కుని వ్రాసిన కథ యిది.)



## సంక్షిప్త జీవిత వివరాలు


ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్. ఏ. పాస య్యాను. మొదటిసారిగా నా కథ యూని వర్సిటీ మ్యాగ్జయిన్‌లో అచ్చయింది. నా మొదటి కథ ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో ప్రచురింపబడింది. ఇంకా నేను వ్రాసిన కథలు, వ్యాసాలు ప్రముఖ దిన, వార పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. అప్పుడప్పుడూ కవితలుకూడా వ్రాస్తాను. రచన ఎప్పుడూ వాస్తవికతకు దగ్గరగా వుండా లనుకుంటాను. పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. నేను అభి మానించే రచయితలు చాలామంది వున్నారు. ఇంతకన్నా నా గురించి చెప్పే వివరాలు ఏమీ లేవు ప్రస్తుత నివాసం బెంగుళూరు.

—కె. శైలజ



రథం ముగ్గు

— ఆర్. పద్మావతి, విల్లివాకం



సంక్రాంతి ముగ్గు

—డి. శాంత, బొంబాయి